95 శాతం పనులు పూర్తి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బాలాజీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలాజీనగర్ డివిజన్‌లో 4 కోట్ల 34 లక్షల రూపాయలతో వివిధ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. అదే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు 95 శాతం పనులు ఇప్పటికే పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా మూడు నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు.

◆ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలైన పార్కులు, రోడ్లు, ఓపెన్‌జిమ్‌ల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిధులు కేటాయిస్తూ పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. అంతేకాకుండా పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక పార్కులు నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచే ప్రారంభమైందని అన్నారు. గత తొమ్మిదేళ్ల కాలం ఉంచి నిత్యం ప్రజల్లో ఉంటూ ఎక్కడ ఏ సమస్య ఉన్నా పరిష్కరించుకుంటూ వస్తున్నామని ఏదైనా ఇబ్బంది ఉంటే తనను నేరుగా సంప్రదించాలని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రజలకు సూచించారు.

◆ కార్పొరేటర్ శిరీష మాట్లాడుతూ.. ప్రజా అవసరాల కోసం వదిలిన, ఖాళీగా ఉన్న స్థలాల్లో పార్కులను నిర్మించారు. సీసీరోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి, సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి, ఈఈ సత్యనారాయణ, డిఇ ఆనంద్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

11న ఆకార్‌ఆశ ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ప్రధాన రహదారిలోని రాందేవ్‌రావు ఆస్పత్రి సమీపంలోని ఆకార్ ఆశ ఆస్పత్రి ఈనెల 11వ తేదీన శరీర పునర్నిర్మాణ శస్త్ర చికిత్సల కోసం ఉచిత పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులతో పుట్టుకతో కలిగే అంగ వైకల్యాలు, గ్రహణ మొర్రి, అగ్ని ప్రమాదాలు, యాక్సిడెంట్ల వల్ల కలిగిన అంగవైకల్యం, కణతులు వంటి తదితర వాటికి శిబిరంలో పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం .73373 18544.

నెల తర్వాత పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ శ్రీ చిత్తారమ్మ దేవాలయం వద్ద తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నెల రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. బుధవారం 'తాగునీరు రోడ్డుపాలు'అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వవిద్యాలయాల ప్రతిష్టను దిగజార్చటం బాధాకరం

జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: ఓయూ జాక్ పేరు మీద, టీఎస్ జాక్ పేరు మీద కొందరు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ప్రతిష్టను దిగజార్చటం బాధాకరమని జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి జవ్వాజి దిలీప్ సాహూ అన్నారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్ పరిపాలనా భవనం ఆయన మాట్లాడుతూ... కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థి నాయకులను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. కిట్స్ కోదాడ ఇంజినీరింగ్ కళాశాల ఒక్కటే కాదు, ఏ కళాశాలలో అయినా తప్పుడు పత్రాలు ఇస్తే వారికి అనుమతులు జేఎన్‌టీయూహెచ్ ఉన్నతాధికారులు ఇవ్వరని తెలిపారు. ఒకవేళ కిట్స్ కళాశాల యాజమాన్యం తప్పుడు పత్రాలు ఇచ్చినట్లుగా ఆధారాలుంటే ఆయా విద్యార్థి నాయకులు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా వీసీ డౌన్ డౌన్ అని నినాదాలు చేయటం సరి కాదన్నారు. ఇలాంటి విధానాలు విశ్వవిద్యాలయాల ప్రతిష్టకు భంగం కలిగిస్తాయని పేర్కొన్నారు. ఓయూ జాక్ నాయకులు ముందుగా ఓయూ అభివృద్ధి గురించి ఆలోచన చేయాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాయి వర్షిత్, పవన్, శివకృష్ణ, బ్రహ్మం, దినేష్, వంశీ పాల్గొన్నారు.

సంకట హర చతుర్థి పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు, కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్ లహరి అపార్టుమెంట్‌లో గణనాథుడికి సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, ఎమ్మార్పీఎస్ డివిజన్ ఇన్‌చార్జ్ మంద మధుకర్‌మాదిగ, నాయకులు మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్, పవన్‌కుమార్, ప్రకాశ్ పాల్గొన్నారు.

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌కు అభినందనలు

జీడిమెట్ల: అత్యవసర సమయంలో వచ్చి కాలనీలో సేవలు అందించిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) బృందాన్ని కాలనీవాసులు అభినందించారు. మంగళవారం సాయంత్రం జీడిమెట్లలో తీవ్రమైన గాలివానకు సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌నాయక్‌నగర్‌లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపోయి రోడ్లపై పడ్డాయి. దీంతో ఎస్‌ఆర్ నాయక్‌నగర్, జనప్రియ అపార్ట్‌మెంట్, మోడీ బిల్డర్స్, దుర్గాకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోయింది. విద్యుత్‌లో అంతరాయం ఏర్పడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న డీసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది కాలనీకి చేరుకున్నారు. అతి తక్కువ సమయంలోనే రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను తీసివేయడంతో పాటు విద్యుత్ స్తంభాలను పక్కకు వేశారు. దీంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను పురరుద్ధరించేందుకు వీలుగా మారింది. కాలనీలో విద్యుత్ రావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. డీఆర్‌ఎఫ్ బృందాన్ని కాలనీవాసులు అభినందించారు.

బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం

- 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నియోజకవర్గ కేంద్రాల్లో రెండో విడత గొర్రెల పంపిణీ
- జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రకటించిన బీసీ కుల, చేతివృత్తి దారులకు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం అర్హులైన వారు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఈ దరఖాస్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేస్తారన్నారు.బీసీ కుల,చేతి వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమాన్ని ఈ నెల 9 ముఖ్యమంత్రి కేసీఆర్ లాంచనంగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కమలాకర్, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈనెల 9న సంక్షేమ సంబురాల సందర్భంగా రెండో విడత గొర్రెల పంపిణీ, ఇళ్ల పట్టాల పంపిణీ, బీసీ కుల వృత్తిదారులకు ఆర్థిక సాయం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఈనెల 14న నిర్వహించనున్న వైద్య దినోత్సవాన్ని ఘనంగా జరపాలన్నారు. వైద్య విద్యార్థులను వేడుకలకు ఆహ్వానించాలన్నారు. వైద్యశాఖలో ప్రతి భోకనబరిచిన అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు అవార్డులు అందజేయాలన్నారు. వైద్య శాఖ మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పునః ప్రతిష్ఠాపనోత్సవం


జోనల్ కార్యాలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జెడ్‌సీ మమత

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన శ్రీవిజయదుర్గ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జెడ్‌సీ మమత, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈఈ గోవర్దన్, బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయినేని చంద్రకాంత్‌రావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

మూసాపేట: కూకట్‌పల్లి జోనల్‌కార్యాలయంలో శ్రీ విజయదుర్గా అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఆహ్వానం మేరకు బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వడ్డేపల్లి రాజేశ్వరరావును సభ్యులు సన్మానించారు. అన్నదానం కార్యక్రమం జరిగింది.

న్యూ గౌతమ్‌నగర్‌లో సీసీరోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని న్యూ గౌతమ్‌నగర్‌లో నూతనంగా వేసిన సీసీరోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో కోట్ల రూపాయల వ్యయంతో డివిజన్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాహ్ బగ్గాష్, అంజయ్య, పంతులు, మొహమ్మద్ ఆలీ, రెడ్డి, చింటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని ఆనన్య ఆస్పత్రి నుంచి తూర్పు కమాన్ వరకు చేపట్టనున్న సీసీరోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలననఅరు. ఏఈ శివప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నేడు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు 3వ ఫేజు ఎల్‌ఐజీ 66 కన్యకా పరమేశ్వరి ఆలయం వెనుక నూతన పైప్‌లైన్ పనులకు, 8.45గంటలకు కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్స్ వార్డు కార్యాలయం ఎదురుగా కాంపౌండ్ వాల్ నిర్మాణం, 9గంటలకు 4వ ఫేజ్‌లో పార్కు కాంపౌండ్‌వాల్ నిర్మాణం, 9.15గంటలకు 7వ ఫేజ్ బాస్కెట్‌బాల్ గ్రౌండ్ వెనుక సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు, 9.30గంటలకు గోపాల్‌నగర్‌లో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు, 9.45గంటలకు విశ్వంభరా ఎన్‌క్లేవ్ వద్ద పార్కు చివర కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులు, 10గంటలకు వసంత్‌నగర్ పిల్లల పార్కు వద్ద టెన్నిస్ కోర్టు కాంపౌండ్ వాల్, 10.15గంటలకు భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-2 సీసీరోడ్డు నిర్మాణం, 10.30గంటలకు ఎస్‌ఆర్‌ఎస్‌ఐ కాలనీ కమాన్ దగ్గర సీవరేజ్ లైన్ కోసం, 10.45గంటలకు డ్రీమ్ వ్యూకాలనీ వద్ద పార్కు కాంపౌండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమాలకు కేపీహెచ్‌బీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు రావాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిత్తారమ్మ బస్తీ డబుల్ బెడ్‌రూమ్స్ వెనుక ఉన్న ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురై చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గడప గడపకు బీజేపీ


హైదర్‌నగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న రవికుమార్‌యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: గడప గడపకు రవన్న పాదయాత్రలో భాగంగా బుధవారం హైదర్‌నగర్ డివిజన్ సాయి ప్రశాంత్‌నగర్, కృష్ణవేణినగర్‌లలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణవేణినగర్ ప్రజలు అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ హయాంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. పాదయాత్రలో స్థానికులు తెలిపిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, అరుణ్ కుమార్, శేషయ్య, బాలకృష్ణ, వెంకట్ మనోహర్‌గౌడ్, ఎంకే దేవ్, సీతారామరాజు, కృష్ణంరాజు, నర్సింగ్, సిద్ధి నర్సింగ్, రామయ్య, సైదమ్మ, బాగోని శ్రీనివాస్, బాలాజీ, బద్రి, రాజారెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని కాపాడటం దారుణం

నిజాంపేట్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజేష్ భూషణ్‌సింగ్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా బుధవారం ప్రగతినగర్‌లోని జేఎన్‌టీయూ ఆటోస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని కాపాడే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. నిరసనలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.శంకర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాబునాయక్, ఉపాధ్యక్షుడు మహేష్ రెడ్డి, నాయకులు సింగోటి, భాస్కర్, చాంద్, లతీఫ్, నర్సింహ, వరదారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రయాహ్నిక దీక్ష

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట ఛత్రిగడ్డలోని శ్రీసాంబశివ దేవాలయ పునర్ నిర్మాణం, శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. త్రయాహ్నిక దీక్షతో మేడ్చల్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎనుగుల తిరుపతి విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆలయం ఆవరణలో జరిగిన పూజలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, మురారి, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

5 లక్షల బీసీ రుణాల దరఖాస్తులు ఏమయ్యాయి?

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: దళిత బంధు పేరిట దళితులను మోసం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలను సైతం మోసం చేసేందుకు సిద్ధమయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. 'కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా'లో భాగంగా బుధవారం సూరారం డివిజన్‌లో పర్యటించారు. రాజీవ్ గాంధీనగర్, శివాలయనగర్ కాలనీల్లో స్థానిక నాయకులతో కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సామాజికంగా విభజించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని కేసీఆర్ చేస్తున్నారని విమర్శించారు. బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న 5లక్షల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత తొమ్మిదేళ్లుగా దరఖాస్తు చేసకున్న పింఛన్లు, తెల్ల రేషన్‌కార్డులను వెంటనే జారీ చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు దుర్యోధన రావు, డివిజన్ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి, నాయకులు చండి శ్రీనివాస్, బావిగడ్డ రవి, పత్తి రఘుపతి, కూన రఘుగౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- బాలానగర్ బడిబాటలో ఉపాధ్యాయులు
- ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న టీచర్లు
- పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని సూచన


బాలానగర్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బాలానగర్: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్లు లేకుండా చూడటం.. కొత్త విద్యార్థులను బడిలో చేర్చుకోవటం లక్ష్యంగా జూన్ 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ సర్కారు బడిలో పిల్లలను చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు. ప్రతి బస్తీలో బడి ఈడు పిల్లల వివరాలను ఉపాధ్యాయులు గుర్తించి వారిని సమీప పాఠశాలల్లో నమోదు చేయిస్తున్నారు.

◆ బడిబాటను ప్రతి రోజు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు అందరూ పాల్గొని ఇంగ్లిష్, తెలుగు మీడియంలో విద్యాబోధన, ఉచిత స్కూల్ యూనిఫాం, మధ్యాహ్నం భోజనం, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు ఉచితంగా అందజేస్తామని అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేక నమోదు జరిగాక ఈనెల 12 నుంచి 17 వరకు పాఠశాల స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాటను సందడిగా నిర్వహిస్తున్నారు.

అమోర్ ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్రచికిత్స


చికిత్స అనంతరం కోలుకుంటున్న రాజేష్

కూకట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 25 శస్త్రచికిత్సలు చేయించుకున్న ఓ యువకుడికి అమోర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. ఆస్పత్రి చీఫ్ ఆర్థో అంకాలజీ సర్జన్ డా. కిశోర్ బి రెడ్డి మాట్లాడుతూ.. భద్రాచలానికి చెందిన 27 ఏళ్ల రాజేష్ 2019లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అతడికి పలు శస్త్రచికిత్సలు చేశారన్నారు. మూడేళ్లలో 25 శస్త్ర చికిత్సలు చేసిన వైద్యులు చివరికి కాలు తొలగించాలని తెలిపారని అన్నారు. అనంతరం అమోర్ ఆస్పత్రికి వచ్చిన ఆ యువకుడికి వివిధ పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స చేశామన్నారు. బాధితుడి కాలి పాదం కూడా తీవ్రంగా దెబ్బతినడంతో దానికి కూడా అమోర్ ఆసుపత్రిలో విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ వైద్య బృందానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు.

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదు


కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని భవానీనగర్, వెస్లీ టీచర్స్‌కాలనీ, ఫ్రెండ్స్‌కాలనీల్లో బుధవారం బీజేపీ భరోసా పాదయాత్ర నిర్వహించారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి ప్రజల్లోకి వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యారావు, సంతోష్‌గౌడ్, పప్పు పటేల్, రవికుమార్‌గౌడ్, సత్యమూర్తి, జగదీష్, బల్వీందర్‌సింగ్, వేణుగోపాల్ రెడ్డి, శంకర్, లక్ష్మీయాదవ్ పాల్గొన్నారు.

నేడు 'ఊరూరా చెరువు పండుగ'



- బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు
- చెరువుల వద్ద గజ ఈతగాళ్లు, పోలీసులు, గ్రామ పెద్దలు ఉండేలా చర్యలు
- కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్ జిల్లాలో తలపెట్టిన 'ఊరూరా చెరువు పండుగ' విజయవంతానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగే ఊరూరా చెరువు పండగను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సంబురాల్లో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. చెరువులకు వెళ్లే రోడ్లను విస్తరించడంతో లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్తు సరఫరా అందించాలని, లేని పక్షంలో జనరేటర్ ద్వారా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువు కట్ట వద్ద జరిగే బహిరంగ సభను పూలతో అందంగా అలంకరించి, అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. బతుకమ్మ నిమజ్జనం చేసే చెరువుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని గ్రామాల్లో చెరువులు లేనందున ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పక్కనే జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. చెరువు కట్ట పరిసరాలలో బారీకేడ్ల ఏర్పాటుతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామం నుంచి చెరువుల వద్దకు డప్పులు ,బోనాలు బతుకమ్మలతో మత్స్యకారుల వలలతో ఊరేగింపుగా వెళ్లాలన్నారు. చెరువువద్ద కట్ట మైసమ్మ పూజ తర్వాత నీటి పూజ చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బతుకమ్మ కోలాటాలు, గోరేటి వెంకన్న రాసిన 'చెరువోయి.. మా ఊరి చెరువు' తదితర పాటలు వినిపిస్తారన్నారు. సాగునీటి రంగం ప్రగతి, పంట ఉత్పత్తి, మత్స్య సంపద, భూగర్భ జలాల పెరుగుదల వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. చెరువు కట్ట వద్ద నిర్వహించే సహపంక్తి భోజనాల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. భౌరంపేట పెద్ద చెరువుతో పాటు బాచుపల్లి బిన్ చెరువు, చింతల చెరువులో పెద్ద ఎత్తున ఊరూరా చెరువు పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.